


ఆరోజు లాటరీ ఫలితాలు తెలిసిన రోజు. ప్రతిసారిలాగే ఆ దినమూ ఆఫీసులో విచార పర్వపారాయణ ముగిసింది.

'... కష్టంలో ఉన్నవాడివి ... కనీసం నీకైనా వచ్చిఉంటే ఎంతో సంతోషించే వాళ్ళం మావా...' టీ కప్పు అందుకుంటూ అన్నాడు కమలాకరం.

'పోనీలే బాబు...ఆ మాత్రం అన్నావు... అదే చాలు—'

ఆ ఆఫీసులో పరమానందం జవానైనా —వయసులో అందరికన్నా పెద్ద. అతనంటే అందరికీ అభిమానం...పెద్ద కుటుంబీకు డని సానుభూతి. అందరూ తన్ని ఆప్యాయంగా 'మావా'— అని పిలుస్తుంటే అతనికి అనిర్వచనీయమైన ఆనందం.

'...సరే...ఇప్పుడొక విషయం చెప్తాను .. డబ్బులు పెట్టి, అప్పులు తీసుకొని గూడా టికెట్లు కొన్నా ఫలితం శూన్యం. అంచేత, అందరం చేరి కొంటే అదృష్టం ఉంటే అందరికీ వస్తుంది — లేకుంటే పెద్ద నష్టమూ ఉండదు ... ఏమంటారు?—'

'అవును మావా ... నీవన్నది చాల బాగుంది... మొన్న మా ఆయన ఆఫీసులో ఇలానే చేరి ఒక ప్రైజు సంపా..'

'నిజంగానా?'— కాషియర్ సదానందం నిర్ఘాంత పోయాడు

'...ప్చ్...ఏం...'లాభం...అందులో మా వారు చేరలేదు-' సరోజ పెదవి విరిచింది.

'అది ... అందుకే వచ్చినట్లుంది—' ఆనందంగా, సుందరంగా అన్నాడు సుబ్బారావ్ — సరోజతో సహా ఫక్కున అందరూ...నవ్వారు

—'అయితే ఇదంతా నువ్వే నిర్వహించాలి

మాట—' మోహన్‌రావ్ అన్నాడు.

'ఆఁ... నాకెందుకు చదువురాని చచ్చి వోణ్ణి...బాబూ...అలా కూర్చుంటే ఎలా? మీరే వీటన్నిటికీ సరి—' అకౌంటెంటును చూపిస్తూ అన్నాడు.

పరమానందం ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు.

అకౌంటెంటు నిర్మల్‌రావు, కోదండం, చిదంబరం కలసి ఓ 'కమిటీ'గా యేర్పడి 'సిండికేటు' ఆరంభించడానికి మంచి చెడ్డలు చర్చించారు.

ఈ తొమ్మిది మంది పది సంవత్సరాల పైచిలుకు నుండి కలసి పని చేస్తున్నారు. అందుకే అందరికి అంత చనువు. అకౌంటెంటునీ, జవానని అంతస్తులను వారే వాడో విస్మరించారు.

దాదాపు సాయంత్రం అయిదుగంటలవు తుండగా 'సిండికేటు కమిటీ' ఒక నిర్ణయాని కొచ్చింది.

కమిటీ ఒక్కొక్కరికి ఒక్కొక్క బాధ్యత అప్పగించింది. నిర్ణయ ప్రకారం వసూళ్ళు చేయటం మోహన్‌రావ్, టిక్కెట్లు కొనటం పరమానందం, ఆ టిక్కెట్ల నెంబర్లని కైపు చేసి అందరికీ పంచడం సరోజ వంతు.

రోజులు మెల్లగా గడిచాయి.

రేపే డ్రా రోజు—

ఆరోజు ముందు...

'ఏమోయ్...కమలాకరం ... వస్తుందం టావా...'

'వ... స్తుం ... ది — సాగతీస్తావేమి టోయ్—' సదానందం మాటల్ని విమర్శించాడు.

'ముందు ముడుపు చెల్లించాలోయ్—' అన్నాడు మోహన్‌రావు.

'మా యిల్లు రిపేరు చేయించాలోయ్'— చిదంబరం అన్నాడు.

'నావాటా 'చి ట్ ఫ ం డ్ కే'— మా అమ్మాయ్ రెడీగా...ఉం...ది—' కోదండం అన్నాడు.

'వచ్చినా ఏం లా...భం...' భార్యను గుర్తు తెచ్చుకుంటూ అన్నాడు సుబ్బారావ్;

'నామటుకు...మన ఏడుగురి వాటాల్లో మంచి వేసుకొని మావకూతురు లచ్చి పెళ్ళికి సహాయపడాలని, మన సరోజకు ఒక మంచి 'నెక్లెస్' చేయించాలని ఉందిరా...ఏమంటారు?—'

ఆరుగురూ నిర్మల్‌రావ్ ప్రతిపాదనకు ఏక కంఠంగా 'అవు'—నన్నారు.

'ఛ...చాల్లెండర్రా ... నాకెందుకు?— మావకు సాయపడటం మంచిది—' సరోజ అంది సిగ్గుపడుతూ.

'నువ్వూరుకో వమ్మా...మా అందరికి ఒక్కగా నొక్క ఆడపడుచువి... ఆమాత్రం చేయకపోతే ఎలా?—'

సుబ్బారావ్ మాటలకు సరోజ కళ్ళు చెమ్మగిల్లాయి.

* * *

మర్నాడు అందరివీ షేక్స్‌పియర్ ముఖాల్లా తయారయ్యాయి. వీళ్ళు కొన్న టికెట్టు నెంబరు మొదటి బహుమతి పొందిన నెంబర్లకు దాదాపు పాతికవేల నెంబర్ల చేరువులో ఉంది—అది వీరి విచారానికి మరింత కారణం!

పదకొండు గంటలకల్లా టీ కలిపి తెచ్చే పరమానందం పది పైసల టీ లా తయారయ్యాడు.

ఈ పరిస్థితుల్లో అందర్నీ ఆదుకోటం తన కర్తవ్యంగా భావించింది సరోజ. వెంటనే 'లంచ్ రూం'లోనికెళ్ళి యించక్కా తొమ్మిది మందికి టీ చేసి, సాగదీసి బుజ్జగించి మరీ వచ్చింది.

ఆత్మారాముడి అరుపులకు ఆగలేకనేమో మెల్లగా 'లంచి' ముగించి దాదాపు మూడింటికి సంతాప సభ ప్రారంభించారు.

'.........................'

'× × × × × × ×'

'________________'

'మీరేమన్నా అనండి—రద్దు చేయటం నా కిష్టం లేదు—'

సరోజకు గట్టి మద్దత్తే ఇచ్చారు చిదంబరం కమలాకరం.

'అసలైనా, ఈసారినుండి అన్ని రాష్ట్రాలవి కొనటం మంచిదనిపిస్తోంది—'

మరి కాసేపటి తర్జన భర్జనంతో నిర్మల్‌రావ్ చెప్పినదానిని అంగీకరించారందరూ. కమిటీలో మార్పుండరాదని నిర్ణయించారు.

* * *

'రామేశ్వరం వెళ్ళినా శనేశ్వరం వదల దంటారు.

మరి కొన్ని డ్రాలు జరిగినా— 'ఎక్కడ ఉన్నావే గొంగళీ అంటే ... వేసిన చోటే ఉన్నానన్నట్టు—' వాళ్ళూ యథాస్థితికే వచ్చారు.

ఎప్పటిలాగే అందరికీ టీలు అందిం ధైర్యాలు చెప్పటం సరోజకు తప్ప లేదు.

'...ఇదిగో చూడండర్రా ... మీరు ఈ 'సిండికేటు' మానవద్దండి — మా వారి ఆఫీసులోని 'సిండికేటు'లో ఆయన లేనప్పుడు ప్రైజు వచ్చింది — ఉన్నప్పుడు రాలేదు... బహుశా ఆయన గ్రహాలే నాకూ పట్టి ఉంటాయి. అంచేత నే తప్పుకుంటే దురదృష్టం తప్పుకోవచ్చునేమో!' — నచ్చచెబుతూ అంది సరోజ.

సరోజ చెప్పినదానికి ఎవ్వరూ ఒప్పుకో లేదు.

అందర్నీ ఒప్పించడానికి 'విజయవాడ' సిటీ బస్సు ఎక్కి దిగినంత హైరాన పడింది సరోజ.

నిర్ణయించిన ప్రకారం మోహన్‌రావు వసూలు చేసాడు—సరోజ దగ్గర తప్ప. అన్ని రాష్ట్రాల టికెట్లు కొన్నాడు పరమానందం. సరోజ బాధ్యత కూడా అతనే నిర్వహించాలని అందరూ నిర్ణయించినందున ఆ ప్రకారం తలా ఓ ప్రతి వ్రాసి యిచ్చాడు.

* * *

ఉదయం ఆరుగంటల సమయం కావచ్చింది.

అప్పటికే 'హోటల్ మనోరమ'—ముందు —సరోజ, పరమానందం తప్ప మిగతావారు హాజరయ్యారు.

అందరి ముఖాల్లోనూ ఓ విధమైన, అనిర్వచనీయమైన ఆనందం తొణికిసలాడుతోంది.

అవును—ఓ లక్ష వచ్చిందంటే మరి మాటలా!

అప్పుడే వచ్చిన సరోజ చుట్టూ చేరి కృతజ్ఞతలు వెల్లడించారు.

తమ మాట నిలబెట్టుకుంటామని అన్నారందరూ!

పరమానందం కోసమై మరి కాసేపు చూచి ఆపై కాఫీలు ముగించారు.

ఆరున్నర దాటింది పరమానందం

లాలేదు!

‘తమకు కలిగిన అదృష్టానికి సంతోషంలో ఇక్కడకు రావాలన్న సంగతి మర్చిపోయి ఉండవచ్చు...మనమే మావ ఇంటికి పోదాం రండి–’ అంటూ నిర్మల్‌రావ్ దారి తీసాడు.

పరమానందం ఇంట్లోనే ఉన్నాడు.

ఒక్కసారిగా మిన్నువిరిగి పడ్డట్టు అందరూ తమ తమ కృతజ్ఞతలు చెప్పి అతని హస్తవాశిని కొనియాడారు.

అందరూ సద్దుకున్న తర్వాత అతనిలో అణగి ఉన్నదేదో పైకి ఉబికింది—

‘నిర్మల్‌రావోయ్’— అని కౌగలించుకొని మరీ కన్నీరు కార్చాడు పరమానందం.

ఆనందం పట్టలేక కాబోలు అని అనుకున్నారందరూ...

‘నేనేం చేసేది బాబూ’ — మరి కాస్త గట్టిగా అన్నాడు.

‘అసలింతకూ ఏం జరిగింది మావా’— కంగారుగా అన్నాడు కమలాకరం.

‘లాటరీ వచ్చిందట గదా!—’ పరమానందం గొంతు జీరబోయింది.

అందరికీ ఆశ్చర్యం—ఆ పైన ఆదుర్దా కలిగింది.

‘సంతోషించవలసిన ఈ సమయంలో ఇలా అంటావేమి మావా’—

‘ఏం చెప్పేదమ్మా...ఎలా చెప్పమంటావమ్మా—’

‘అంత చెప్పగూడనిదేముంది—’కోదండం విసుగ్గా అన్నాడు.

‘చెప్పినా మీరు నమ్మరు బాబు—’

‘కొంపదీసి టికెట్టు పోగొట్టుకోలేదు కదా!’—

‘————’

‘మాట్లాడవేం...మాతో చెప్పడానికేం!’

‘......................’

‘నీకేం అపకారం జరగదులే–’

‘......................’

‘చెప్పు మావా–చెప్పు–’

‘అసలు నేను టికెట్టు కొనలేదు–’

ఒక్క నిముషం ఎవ్వరిలోనూ చలనం లేదు.

‘...కొన్న టికెట్టు పోగొట్టి అది చెప్పలేక ఇలా అంటున్నాడేమో! — అయినా టికెట్టు మనవద్దే ఉంచుకున్నట్టయితే బాగుండేది’–అని కొందరైనా అనుకోక పోలేదు. అయితేనేం అందరికి ఓ నమ్మకం ఉంది — ‘పరమానందం అనవసరంగా అబద్ధం చెప్పడు—’ అని.

‘నే చెప్పేది నిజం...నా మాట నమ్మండి ...అసలు నేను టికెట్టు కొనలేదు—’ పరమానందం ధోరణి మారలేదు.

ఇంతలో సుబ్బారావుకు ఏదో తోచినట్లుంది...గబ గబా చేతిలోని పత్రిక తీసి చూచాడు.

‘...అవును...మావ చెప్పేది నిజం. లక్ష రూపాయలు ‘మైసూరు’కు వచ్చింది—’ పత్రికను మరోసారి నిశితంగా చూస్తూ అన్నాడు.

మరో నిముషం అంతా నిశ్శబ్దం.

‘పోనీలే మావా...మనకే రావాలని ఉన్నదా యేం?...ఒకవేళ నీవు టికెట్టు కొని ఉన్నా ఈ లక్ష మాత్రం వచ్చి ఉండేవి కావు–’ నిర్ధారణంగా అన్నాడు కోదండం.

‘నన్నుమానించడం లేదు గదా!’—

‘అంత మాట అనకు మావా...అయినా ఆ డబ్బంతా...’

‘ఏదో యిబ్బంది గొంతు మీది కొచ్చి ఖర్చుపెట్టి ఉంటాడు ... ఫరవాలేదులే మావా...నీకే గదా ఉపయోగపడింది—’ చిదంబరం అన్నాడు మామూలుగానే!

‘కాదు బాబు.’

అసలే అదో విధంగా ఉన్న అందరూ అతని మాటకు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

‘అవును బాబూ ... మనం రూపాయ పెట్టి టికెట్టు కొని లక్షరూపాయల్లో వాటాకై ఏవేవో అనుకున్నాం...ఎంతెంతో ఆశపడ్డాం... గడవడానికి ఉన్నవాళ్ళమైనా ఈ వేదన ఎందుకో మనకు? నేనే యిచ్చాను సలహా కూడా!.. కష్టపడకుండా ఫలితం రావాలని భ్రమించాం—’

‘అటు చూడండి లక్షల మంది శరణార్థులు తిండితిప్పలకై కాచుకొని ఉన్నారు ...అందుకే డబ్బంతా ‘బంగ్లాదేశ్ శరణార్థుల నిధి’కి పంపాను—’

‘ఇన్ని సార్లైనా మనకి అదృష్టం రానప్పుడు, ఈసారి మాత్రం వస్తుందని యేముంది?—అందుకే ఆ ముప్పై రూపాయలు ఇలా ఉపయోగించి — ఏవో కొన్ని నెంబర్లు మీకు వ్రాసి ఇచ్చాను—’ గంభీరంగా అన్నాడు పరమానందం.

ఆ నిముషంఎవ్వరూ మాట్లాడలేదు.

‘—ఇదిగో అందుకు నిదర్శనంగా ఆ నిధివారు పంపిన రసీదు —’ అంటూ పరమానందం పెట్టెలో నుండి రసీదు తీసి చూపించాడు.

